


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శనివారం 6 సెప్టెంబర్ 2025 పేజీలు 8


# దుష్ప్రచారాన్ని నమ్మొద్దు



- జిల్లాలో యూరియా కొరత లేదు
- మంత్రి వాసంశెట్టి సుభాష్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో యూరియా కొరత ఉందనే దుష్ప్రచారాన్ని, తప్పుడు వార్తలను రైతులు నమ్మవద్దని రాష్ట్ర కార్మిక బాయిలర్లు ఫ్యాక్టరీలు భీమా వైద్యసేవల శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జడ్పీ కన్వెన్షన్ హాలులో ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రి పాత్రికేయులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రతిపక్షం యూరియా కొరత ఉన్నట్లుగా తప్పుడు వార్తలు సృష్టిస్తుందని, క్యూలో ఉన్న రైతులు ఫోటోలు తీసి ప్రతిపక్షం వారు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొనడం సరైనది కాదన్నారు. ఎవరైనా సరే కావాల్సినవి తీసుకోవాలంటే ఏదైనా ఒక పద్ధతి అనుసరించాల్సి ఉంటుందని, ఆ విధంగా రైతులు యూరియా తీసుకోవడానికి క్యూలో నిలబడితే దాన్ని నేరంగా చూపడం సమంజసం కాదన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా చల్లితే సరిపోతుందని అలాంటిది కొరత వస్తుందని దుష్ప్రచారం చేయడంతో చాలామంది రైతులు అధికంగా యూరియా బస్తాలు కొనుగోలు చేసి నిల్వ ఉంచుకుంటున్నారన్నారు. దానివలన అక్కడక్కడ కొంత తగ్గుదల కనిపించిందన్నారు. వాస్తవానికి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో 1.34లక్షల హెక్టార్లలో వరి సాగు చేశారని, ఏప్రిల్ మాసంలో 28,773 మెట్రిక్ టన్నుల మిగతా 2లో...

ట్రావెల్, టూరిజం రంగాల్లో..

## విస్తృత ఉపాధి అవకాశాలు

- నైపుణ్యాలే కెరీర్ వృద్ధికి సోపానాలు - ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

వివరాలు 2లో




రైతులతో జిల్లా కలెక్టర్ బాలాజీ

## ముఖాముఖి

యూరియా సరఫరా పై ఆరా

సంతృప్తి వ్యక్తం చేసిన అన్నదాతలు



**పామర్రు మేజర్ న్యూస్ :** జిల్లాలో యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందని, రైతులు అపోహలకు గురికా వద్దని, భయాందోళన చెందకుండా నిశ్చింతగా ఉండాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రైతులకు తెలిపారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం పంట పొలాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. యూరియా కొరత ఉందని భావించి ఆందోళనకు గురవుతున్న రైతులను కలెక్టర్ నేరుగా పలకరించారు. వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. యూరియా సరఫరా, పంపిణీ, వినియోగం స్థితిగతులను ఆరా తీశారు. తొలుత జిల్లా కలెక్టర్ పామర్రు మండలం కురుమద్దాలి, కనుమూరు, జుజ్జువరం గ్రామాలలో యూరియా సరఫరాపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రైతులు కలెక్టర్ తో మాట్లాడుతూ ప్రస్తుతం యూరియా అందుతుందని, ఇప్పటికే కొంతమంది రైతులు తమ పొలాలకు రెండు విడతల యూరియా వేశామన్నారు. రైతులకు అవసరమైన యూరియా కొరత లేకుండా చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను అన్నదాతలు కోరారు. ఇందుకు జిల్లా కలెక్టర్ వెంటనే మిగతా 2లో...



జీఎస్టీ తగ్గింపుతో పౌల్ట్రీ పరిశ్రమకు

## మరింత ఊతం

- గుడ్ల ఉత్పత్తిలో రాష్ట్రం మొదటి స్థానం
- విజయనగరంలో కోళ్ళు చనిపోవడానికి బర్డ్ ఫ్లూ వ్యాధి కారణం కాదు

2

(మొదటిపేజీ తరువాయి)

## దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

యూరియా అందుబాటులో ఉందని, ఆగస్టు మాసం వరకు 27,400 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశామన్నారు. ఇంకనూ 1,443 టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. అంతేకాకుండా ఈ సెప్టెంబరు 1 వ తేదీన జిఎఫ్సి నుండి 243 మెట్రిక్ టన్నులు, సిఐఎల్ నుండి 1200 మెట్రిక్ టన్నులు యూరియా జిల్లాకు వచ్చిందన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదన్నారు. కేవలం అభూత కల్పనతో ప్రతిపక్షం ఆరోపణలు చేస్తూందన్నారు. యూరియా కొరత,కొరత అంటూ దుష్ప్ర చా రం చేయడం వలన ఎక్కడ నిజంగా కొరత వస్తుందోనని రైతులు ఆందో ళన చెంది అవసరానికి మించి యూరియా కొనుగోలు చేశారన్నారు. ఎక్కు వగా యూరియా వేస్తే భూమి దెబ్బతింటుందని, దీన్ని రైతులందరూ గమ నించాలన్నారు.రైతులు లేనిపోని అపోహలను, అలజడి సృష్టించే వారిని తప్పుడు వార్తలను ప్రచారం చేసే వారిని నమ్మవద్దని మంత్రి హితవు పలికా రు. జిల్లా యంత్రాంగం ఎంతో అప్రమత్తంగా ఉందని, యూరియా కొరత లేకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుందన్నారు. ఈ సమావే శంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార రాజా, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పాల్గొన్నారు.

## రైతులతో జిల్లా కలెక్టర్ బాలాజీ ముఖాముఖి

స్పందిస్తూ రైతాంగం ఆందోళన చెందవద్దని, అందరికీ యూరియా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం యూరియా కావలసినంత అందుబాటులో ఉందని, ఇంకా జిల్లాకు అవసరమైన యూరియా నిరంతరం కొనసాగుతుందని, పంటపొలాలకు అవసరమైన యూరియాను పంపిణీ చేస్తామని రైతులకు ఎంతో ఓపిగ్గా సమాధానం చెప్పారు. కలెక్టర్ రాక, హా మీలతో హర్షం వ్యక్తం చేసిన రైతాంగం ఆయన ఓదార్పు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

## లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్లి సిఎంఆర్ఎఫ్ చెక్కులు



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సలు చేయించుకున్న మండల పరిధిలోని పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శుక్రవారం స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కపిలేశ్వరపురం గ్రామంలో బొమ్మనబోయిన ప్రసాద్ కు 44,581 రూపాయలు, గూడవల్లి సీత కు 17,684 రూపాయలు, సయ్యద్ హబీబున్నీసా కు 56,652 రూపాయలు, సత్యవోలు వీరమ్మ కు 20వేల రూపాయల చెక్కులను ఆయా లబ్ధిదారులకు అందించారు. మండల కేంద్రమైన పమిడిముక్కల గ్రామంలో గురువిందపల్లి వెంకటేశ్వరరావు కు 40,350 రూపాయల చెక్కును ఆయన ఇంటికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు కుమారుని జన్మదిన వేడుకలలో కూడా ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు.

## అంగరంగ వైభవంగా గణనాధుని గ్రామోత్సవం

### రూ.27 వేలకు లడ్డూ కైవసం చేసుకున్న వెంకటరామయ్య

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఘంటసాల గ్రామంలోని శ్రీ జలధీశ్వర స్వామి ఆలయం ముందు ముస్లీం సోదరుడు అక్బర్ బాషా (షామియాన) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయ చవితి నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. లడ్డూ వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ వెంకటరామయ్య రూ.27 వేలకు కైవసం చేసుకున్నారు. అర్చకులు చావలి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్ పై గణనాధుని నిలబెట్టి తీన్మార్ వాయిద్యాలు, డీజేతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గణనాధుని నిలబెట్టిన ట్రాక్టర్ను బాషా స్వయంగా నడిపి తన భక్తిని చాటుకున్నాడు. శ్రీకాకుళం. గ్రామంలోని కృష్ణానదిలో గణనాధుని నిమజ్జనం చేశారు. 9 రో"ల పాటు పరిసరాలను పరిశుభ్రం చేసిన 10 పంచాయతీ పారిశుద్ధ్యం కార్మికులకు బాషా నూతన వస్త్రాలను అందించారు. నవరాత్రులు విజయవంతగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి బాషా కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, పీఏసీఏస్ ఛైర్మన్ బండి పరాత్పరరావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకటరామకృష్ణ, దోనేపూడి కిషోర్, అయినపూడి సన్నీ, జొన్నలగడ్డ వెంకటేష్, తుమ్మల రేణు, గొర్రెపాటి సురేష్, అయినపూడి రాజేంద్ర, నందేటి శ్రీనివాసరావు, పోతన వెంకటేశ్వరరావు, వేమూరి రమేష్, అరవింద్, జొన్నలగడ్డ హరీష్, సోలే శ్రీను, ఆటో బాబూరావు, రవితేజ, ధర్మారావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# ట్రావెల్, టూరిజం రంగాల్లో విస్తృత ఉపాధి అవకాశాలు

**గన్నవరం (ఆత్కూరు), సెప్టెంబర్ 05, మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరులోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శుక్రవారం సందర్శించారు. ఈ కేంద్రంలో 15 మంది అభ్యర్థులకు ఇస్తున్న ట్రావెల్ అండ్ టూరిస్ట్ గైడ్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఆగస్టు 28న ప్రారంభం కాగా ఈ నెల 6వ తేదీ శనివారంతో ముగియనుంది. జిల్లా లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోంది. జిల్లాను టూరిజం హబ్ గా తీర్చిదిద్దడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఔత్సాహికులకు టూరిజం, ట్రావెల్ గైడ్ అంశాల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. జిల్లాలో పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను పర్యాటకులు సందర్శించేలా ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందుబాటులోకి తేవడానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. నవ్య రాజధాని అమరావతికి ముఖ ద్వారమైన విజయవాడ, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యాటక రంగా అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఏ రంగంలోనైనా కెరీర్ పరంగా ఎదగాలంటే తగిన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ వి.అమరేశ్వర్ రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఎర్త్ హీరోస్ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుతో పౌల్ట్రీ పరిశ్రమకు మరింత ఊతం

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** పౌల్ట్రీ పరిశ్రమకు మరింత ఊతమిచ్చేందుకు జీఎస్టీని పాల ఉత్పత్తుల్లో జీరో స్థాయికి తగ్గించడం అదేవిధంగా పశువుల దాణా, వ్యవసాయ యాంత్రీకరణపై ఐదు శాతం స్లాబ్ కి తగ్గించటం వల్ల ఈ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వచ్చి పెట్టబడులు పెట్టె అవకాశం ఉందని పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు తెలిపారు. శుక్రవారం పశుసంవర్ధక శాఖ సంచాలకుల కార్యాలయములో సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు వ్యాధుల కాలం – పశువులు, కోళ్ళ సంరక్షణపై తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశంపై ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర పౌల్ట్రీ అసోసియేషన్ అధ్యక్షులు డా.కె. సోమిరెడ్డి, ఉపాధ్యక్షులు టి. కుటుంబరావులతో కలసి మాట్లాడుతూ మన రాష్ట్రం దేశంలో గేదెల సంఖ్యలో 6 వ స్థానంలో, గొర్రెల సంఖ్యలో 2 వ స్థానంలో, కోళ్ళ సంఖ్యలో 2 వ స్థానంలోనూ ఉందన్నారు. గ్రుడ్ల ఉత్పత్తిలో మొదటి స్థానంలో, మాంస ఉత్పత్తిలో 4 వ స్థానంలో, పాల ఉత్పత్తిలో 5 వ స్థానంలో ఉన్నామన్నారు. సుమారు 25 లక్షల కుటుంబాలకు పశుసంవర్ధన రంగం జీవనోపాధి కల్పిస్తోందన్నారు. రాష్ట్ర స్థూల వార్షిక ఉత్పత్తిలో 12.17% వాటాతో రూ. 1.61లక్షల కోట్లు పశుగణ రంగం నుంచి లభిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పాడి, కోళ్ళ పరిశ్రమకు కావలసిన సహాయ సహకారాలను అందిచడం వల్ల ఈ పురోభవృద్ధి సాధ్యమైందన్నారు. కూటమి ప్రభుత్వం పశుసంవర్ధక రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి 15% వృద్ధి రేటు సాధించే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. 50 శాతం రాయితీపై పశువుల దాణా, 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు, 85 శాతం రాయితీపై పశు బీమా, 70 నుండి 90 శాతం రాయితీపై గోకులాలు, 100 శాతం రాయితీపై బహు వార్షిక పశుగ్రాసాల సాగు వంటి వాటికి తోడ్పాటు అందిస్తోందన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని సైలేజిని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జొన్న రకాల పశుగ్రాసం ఒకసారి విత్తితే, రెండు మూడు సార్లు రైతులు కోసుకునే లాగా రైతులు 25 శాతం చెల్లించి, 75 శాతం సబ్సిడీ పొందవచ్చన్నారు. ఈ జొన్న సాగును రైతు తనకున్న పొలంలోని అర ఎకరంలో ఉచితంగా వేసుకోవచ్చన్నారు. రాబోయే కాలంలో ప్రతి మండలంలో 5 ఎకరాల్లో పశుగ్రాస నర్సరీలను ఏర్పాటు చేసి పశుగ్రాసాలను పండించి రైతులకు అందించేలాగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు మూడు లక్షల ఎకరాల్లో పశుగ్రాసాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 85 శాతం సబ్సిడీతో పశుబీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడం జరుగుతోందన్నారు. ఈ పథకాన్ని రైతులు మరింత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ రంగంలో మరింత ఉత్పాదకతను పెంచడానికి 70 నుండి 90 శాతం రాయితీపై గోకులం అనే పథకాన్ని నరేగా అనుసంధానంతో అమలు చేస్తున్నామన్నారు. కేవలం పెయ్య (ఆడ) దూడలు పుట్టే విధంగా లింగ నిర్ధారిత పశువీర్య వినియోగాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా రైతులకు ఆర్థిక పరిపుష్టి కలగడానికి దోహదం చేస్తుందన్నారు. ఈ వీర్యం ఖరీదుతో కూడుకున్నప్పటికి రైతుల ప్రయోజనార్ధం రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై సరఫరా చేస్తోందన్నారు. దీనివలన 90 శాతం ఖచ్చితత్వంతో పెయ్య దూడలు మాత్రమే జన్మిస్తాయన్నారు. జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ సహకారంతో ఒక్కొక్క వీర్య నాళికను రూ.300/- లకు కొనుగోలు చేసి, 50 శాతం రాయితీతో రూ.150/- లకే రైతులకు అందజేయడం జరుగుతోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 9,326 కృత్రిమ గర్భధారణ కేంద్రాల ద్వారా పది లక్షల డోసులు పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. 104/108 అంబులెన్స్ ల తరహాలో పశుసంవర్ధక శాఖలో 340 సంచార పశు ఆరోగ్య సేవా వాహనాల ద్వారా రైతుల ఇంటివద్దనే పశు వైద్య సేవలను అందించడం జరుగుతోందన్నారు. రైతులు ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకొని వారి పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. పశువుల్లో, కోళ్ళలో కాలానుగుణంగా వచ్చే వ్యాధులకు వ్యాధినిరోధక టీకాలు అందుబాటులో ఉంచి, రైతులకు ఎప్పటికప్పుడు అందించడం జరుగుతోందన్నారు. అదే విధంగా రైతులు జీవ భద్రతా విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలో కోళ్ళు చనిపోవడానికి బర్డ్ ఫ్లూ వ్యాధి కారణం కాదని, విజయవాడ %ఎదీ=×% సంస్థ ధృవీకరించడం జరిగిందన్నారు. దీనికి కారణం ఇన్ క్లూజన్ బాడీ హెపటైటిస్ (%×దీఎ%), కొక్కెర వ్యాధి (%=ఇ%) అని నిర్ధారించడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 4 వ తేదీన పౌల్ట్రీ లేయర్స్ అసోసియేషన్లతో సమావేశం నిర్వహించి, బర్డ్ ఫ్లూపై ప్రస్తుత పరిస్థితిని వివరించడం జరిగిందని, అన్ని కోళ్ళ ఫారాల్లో జీవ భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని కోరడం జరిగిందన్నారు. అన్ని జిల్లాల పశుసంవర్ధక శాఖ అధికారులకు బర్డ్ ఫ్లూ వ్యాధి పై తగు సూచనలు చేసి, ఏవైనా సంఘటనలను జరిగిన వెంటనే ప్రధాన కార్యాలయానికి తెలియజేయమని ఆదేశాలు జారీ చేసామన్నారు. రాష్ట్రంలో పౌల్ట్రీ పరిశ్రమ మరింత ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. మున్సిపాలిటిలలో వీధి కుక్కల నియంత్రణకు 4 ఎన్.జి.ఓ.లతో అవగాహనా ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. యాంటి రేబీస్ టీకాలు రాష్ట్రంలోని అన్ని పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జన్యుపరంగా మెరుగైన జాతి పశువులను వృద్ధి చేయడంతో పాటు వట్టిపోయిన పశువులను నుండి కూడా మేలుజాతి దూడలను పునరుత్పత్తి చేయడానికి పిండ మార్పిడి విధానాన్ని అందుబాటులోకి తేవడం జరిగింది. తద్వారా రాష్ట్రంలో సగటు పాల ఉత్పత్తి పెరుగుతోందని, గతంతో పోల్చుకుంటే రాష్ట్రం లో పాల దిగుబడి మరింత పెరిగిందన్నారు.

# రైతుల ముసుగులో వైకాపా నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టండి



**పామర్రు మేజర్ న్యూస్ :** రైతుల ముసుగులో వైకాపా నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత తమతో పాటు రైతులపై కూడా ఉందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా సక్రమంగా సరఫరా జరుగుతూ ఉంటే ఒకవైపు రైతులు ఆనందంగానే ఉన్నారని కానీ వైకాపా నాయకులు, కార్యకర్తలకు మాత్రం ఇది నచ్చక లేనిపోని అభాండాలు వేస్తూ అసత్య ప్రచారాలను చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మచిలీపట్నంలో జరిగిన గురుపూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి లతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతులకు చాలావరకు యూరియా సరఫరా చేయడం జరిగిందని, దీనిపై తాము నిత్యం సొసైటీలు, ఎరువుల దుకాణాలను పర్యవేక్షిస్తూ యూరియా రైతులకు సక్రమంగా అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అంతేగాక జిల్లా కలెక్టర్ సైతం ఉదయం నుండి సాయంత్రం వరకు యూరియా పంపిణి పై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తూ చర్యలు తీసుకుంటున్నారని, ఆయన కూడా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడమే కాక యూరియా వాడకంపై అవగాహన కూడా కల్పిస్తున్నారని ఈ సందర్భంగా కుమార్ రాజా పేర్కొన్నారు. ఈ విధంగా అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సక్రమంగా సరఫరా జరుగుతుంటే మరోవైపు రైతుల ముసుగులో వైకాపా నాయకులు తమ కార్యకర్తలను రెచ్చగొట్టి అర్ధరాత్రి సమయంలో లో దుకాణాలకు దిగుమతి అవుతున్న ఎరువుల లారీలను అడ్డగించి దౌర్జన్యం చేయడం విచారకరమన్నారు. రైతులు ఈ విషయాలను గమనించి వైకాపా నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మరో రెండు మూడు రోజుల్లో జిల్లాలోని అన్ని సహకార సంఘాలకు, దుకాణాలకు మరో విడత యూరియా రాబోతోందని ఈ విడతతో రైతులకు పూర్తిస్థాయిలో లభిస్తుందని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని అధికారంలోకి వచ్చిన 13, 14 నెలలలోనే రైతులకు సంబంధించిన ఎన్నో కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి గా వ్యవహరించడం వల్లే ఇవన్నీ సాధ్యమయ్యాయన్నారు. సాగునీటి సంఘాల ఏర్పాటు చేయడం ద్వారా కాలువల అభివృద్ధి, సహకార సంఘాలకు త్రీ మెన్ కమిటీలను ఏర్పాటు చేసి రైతుల భాగస్వామ్యంతో రైతులకు మేలు చేస్తున్నామన్నారు. గత ఐదు సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వం ఉండగా వ్యవసాయం దండగ అనే విధంగా రైతులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన గంటల వ్యవధిలోనే రైతులకు నగదు జమ చేయడం జరిగిందని, విషయాన్ని రైతులందరూ గమనించాలన్నారు. ఇటువంటి తరుణంలో వైకాపా నాయకులు చేస్తున్న విమర్శలను, దుష్ప్రచారాలను రైతులే తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే కుమార్ రాజా పిలుపునిచ్చారు.

## కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో..

# జునిపర్ ఏఐ-డ్రివెన్ క్యాంపస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం





**విజయవాడ, సెప్టెంబర్ 5, మేజర్ న్యూస్ :** కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఇటీవల తన క్యాంపస్‌లో జునిపర్ ఏఐ-డ్రివెన్ క్యాంపస్ - సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభిం చడంతో డిజిటల్ పరివర్తన లో ఒక మార్గదర్శక అడుగు వేసింది. ఏఐ-డ్రివెన్ నెట్‌వ ర్కింగ్‌లో ప్రపంచ నాయకుడైన జునిపర్ నెట్‌వర్క్స్ సహకారంతో స్థాపించబడిన ఈ కేంద్రం, భారతదేశంలో ఎంటర్‌ప్రైజ్-గ్రేడ్, ఏఐ-ఆధారిత డిజిటల్ మౌలిక సదుపాయాలను విద్యా వ్యవస్థలోకి తీసుకురావడానికి ఒక చొరవను సూచిస్తుంది. ఈ ప్రారంభోత్సవానికి జునిపర్ అకాడమీ గ్లోబల్ హెడ్ అర్చన యాదవ్ ముఖ్య అతిథిగా, ఎడ్యుస్కిల్స్ సీఈఓ శుభజీత్ జగదేవ్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. కేఎల్ జునిపర్ ఏఐ-డ్రివెన్ క్యాంపస్ కేవలం ల్యాబ్ కాదు, ప్రతి భాగం - వై-ఫై, వైర్డు ల్యాన్, వ్యాన్, భద్రత, సహకార ప్లాట్‌ఫారమ్‌లు - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఇంటిగ్రేట్ చేయబడి ఆప్టిమైజ్ చేయబడిన ఒక జీవన డిజిటల్ పర్యావరణ వ్యవస్థ. సాంప్రదాయ నెట్‌వర్కింగ్ ల్యాబ్‌ల మాదిరిగా కాకుండా, ఈ సెంటర్ అఫ్ ఎక్స్లెన్స్ విద్యార్థులకు కృత్రిమ మేద -ఆధారిత నెట్‌వర్క్ నిర్వహణ వ్యవస్థలను పరిచయం చేస్తుంది, ఇవి నేర్చుకుంటాయి, అంచనా వేస్తాయి, స్వీయ-స్వస్థతను అందిస్తాయి, అవి నిరంతరాయంగా కనెక్టివిటీ, అత్యుత్తమ భద్రతను నిర్ధారిస్తాయి. విద్యార్థులు, అధ్యాపకులు గ్లోబల్ డిజిటల్ ఎంటర్‌ప్రైజెస్‌లో అమలు చేయబడిన అదే ప్లాట్‌ఫారమ్‌లైన మిస్ట్ కృత్రిమ మేధా, క్లౌడ్-నేటివ్ ఆర్కెస్ట్రేషన్ టూల్స్, ఎంటర్‌ప్రైజ్-స్కేల్ ఆటోమేషన్ ఫ్రేమ్‌వర్క్‌ల వంటి సాంకేతికతలతో నేరుగా పాల్గొంటారు. కేఎల్ డీమ్డ్-టు-బి యూనివర్సిటీ ఛాన్సలర్ ఎర్. కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ, “మా విశ్వవిద్యాలయంలో ఏఐ-ఆధారిత నెట్‌వర్కింగ్‌ను సమగ్రపరచడం ద్వారా, ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలను రూపొందిస్తున్న సాంకేతికతలకు మా విద్యార్థులు ప్రత్యక్షంగా బహిర్గతం అయ్యేలా మేము నిర్ధారిస్తున్నాము. ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మౌలిక సదుపాయాలతో పాటుగా ఇది విద్యార్థులను నూతన ఆవిష్కరణలు ఆవిష్కరించడానికి, నాయకత్వం వహించడానికి, ప్రపంచ డిజిటల్ నాయకులుగా మారడానికి సాధికారత కల్పించడం కొరకు సహాయపడుతుంది ” సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులకు పరివర్తన అవకాశాలను తెరుస్తుంది, వీటిలో జునిపర్ గ్లోబల్ అకాడమీ సర్టిఫికేషన్‌లు, జునిపర్ నెట్‌వర్క్‌లు, ఎడ్యుస్కిల్స్‌తో ఇంటర్న్‌షిప్‌లు, ఏఐ-ఆధారిత నెట్‌వర్కింగ్, ఎల్‌ఓటి, 5జి అప్లికేషన్‌లలో పరిశోధన అవకాశాలు ఉన్నాయి. ఇది అభివృద్ధి చెందుతున్న డిజిటల్ టెక్నాలజీలలో విద్యార్థుల నేతృత్వంలోని ఆవిష్కరణ, స్టార్టప్ ఇంక్యుబేషన్‌కు కూడా వేదికను ఏర్పాటు చేస్తుంది. విద్యార్థుల ప్రయోజనాలతో పాటు, అధునాతన సాంకేతిక నైపుణ్యాన్ని తరగతి గదులకు బదిలీ చేయడానికి దాదాపు 60 మంది అధ్యాపకులు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు చేయించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో అర్చన యాదవ్ మాట్లాడుతూ, డిజిటల్ లెర్నింగ్ వాతావరణాలను పునర్నిర్వచించడంలో ఏఐ-ఆధారిత క్యాంపస్‌ల ప్రాముఖ్యతను నొక్కిచెప్పగా, భవిష్యత్తులో సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని పెంపొందించడంలో పరిశ్రమ-విద్యా భాగస్వామ్యాలు ఎలా కీలకమో శుభజీత్ జగదేవ్ హైలైట్ చేశారు. ఈ సిఓఈ ప్రారంభంతో, కేఎల్ విశ్వవిద్యాలయం డిజిటల్ విద్య, కృత్రిమ మేధా -ఆధారిత ఆవిష్కరణలలో జాతీయ నాయకుడిగా తనను తాను నిలబెట్టుకుంది, దాని విద్యార్థులు ప్రపంచ డిజిటల్ విప్లవానికి నాయకత్వం వహించడానికి సన్నద్ధమయ్యారని నిర్ధారిస్తుంది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సీనియర్ నాయకత్వం, ప్రో వైస్-ఛాన్సలర్ (విద్యావేత్తలు) డాక్టర్ కె. రాజశేఖరరావు, డీన్ - స్కిల్లింగ్ డాక్టర్ ఎ. శ్రీనాథ్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. రాజేష్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోసం అకడమిక్ స్టాఫ్ కాలేజ్, ఎస్‌పిఓసి ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక రాణి చింతల పాల్గొన్నారు.

# మైలవరంలో ఘనంగా మదర్ తెరిసా వర్ధంతి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మదర్ థేరిసా వర్ధంతి సందర్భంగా మైలవరం సెంటరులో ట్రస్ట్ కార్యాలయం లో విగ్రహానికి పూలమాలు వేసి,కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించిన మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయసుధ, సభ్యులుఈ సందర్భంగా ట్రస్ట్ కార్యాలయం లో అనాథలకు, వృదులకు భోజనం, పండ్లు, మందులకు ఆర్థిక సహాయం అందజేత ఈ సందర్భంగా కోయ సుధ మాట్లాడుతూ మదర్ థెరీసాని స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో నిరుపేదలకు, అనాథలకు, వృద్దులకు, వితంతువులకు ఎన్నో సేవా కార్యక్రమాలు ట్రస్ట్ ద్వారా చేస్తున్నామని, అందులో భాగంగా గత సంవత్సరం నుండి 20 మంది అనాథ వృద్దులకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ పాటుగా ప్రతి నెల మందుల కొరకు కొంత ఆర్థిక సహాయం అందిస్తున్నామని, నిస్సాహాయ స్థితిలో ఉన్న అనాథలకు ప్రతి శనివారం రెండుపూటలకు సరిపడ కడుపునిండ భోజనం అందిస్తున్నామని, అలాగే దుప్పట్లు, బట్టలు,నిత్యావసర వస్తువులు పండ్లు వితంతువులకు, దివ్యాంగులకు కూడ అందజేస్తున్నామన్నారు.ఇలాంటి సేవాకార్యక్రమాలు చేయడానికి దాతలు సహకరిస్తున్నాని ఈ సందర్భంగా ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ట్రస్ట్ లో టీచర్ గా ఇటీవల రిటైర్డ్ అయిన లిల్లీ కి చిరు సత్కారం చేసారు ఈ కార్యక్రమం లో ట్రస్ట్ కోశాధికారి.విజయలక్ష్మి, సభ్యులు నాగమణి, లిల్లీ,ప్రశాంతి,సుమశ్రీ,కృష్ణ కుమారి,మహిళలు పాల్గొన్నారు.

# 60 శాతం తగ్గింపు ధరతో జైపూర్ రగ్స్ ‘రగ్ ఉత్సవ్’ ప్రారంభం




**విజయవాడ, సెప్టెంబర్ 5, మేజర్ న్యూస్ :** జైపూర్ రగ్స్ ‘రగ్ ఉత్సవ్’ ప్రారంభించామని జైపూర్ రగ్స్ డైరెక్టర్ యోగేష్ చౌధరీ, డైరెక్టర్ తెలిపారు. ఈ రగ్ ఉత్సవంలో చేతితో తయారు చేసిన 14 వేలకు పైగా రగ్స్ ప్రదర్శనలో కలవన్నారు. భారతీయ నేతదారులు మన సంప్రదాయ ఆత్మను ఆధునిక డిజైన్‌తో తీర్చిదిద్దారన్నారు. ఈ సారి ఉత్సవం మరింత వైభవంగా ఉందన్నారు. ఈ ఏడాది రగ్ ఉత్సవ్ 2025లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన కలెక్షన్‌లో ఆలం, జెనెసిస్, సవానా, కన్స్ట్రక్షన్, దా హాస్, వుండర్‌కమ్మెర్, కాలిడో, క్లాన్, బేసిస్, లాకునా, ఎర్బే, ఇండస్‌బార్, నోమాడిక్ థ్రెడ్స్, అకార్, కాంటూర్ వంటి సిగ్నేచర్ కలెక్షన్‌లు ఉన్నాయన్నారు. గ్రామీణ కళాకారుల ఊహాశక్తి నుంచి నేరుగా పుట్టుకొచ్చిన సుమారు 200 ప్రత్యేకమైన మంచాహా రగ్స్ కూడా ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణ అన్నారు. రెండు వేల వింటేజ్ రగ్స్ (30- 50 ఏళ్లు), 250 యాంటిక్ రగ్స్ (100 ఏళ్లకు పైబ డినవి) కలవన్నారు. ఇవన్నీ చూస్తే ఇది అత్యంత విస్తృతమైన రగ్ ప్రదర్శనలలో ఒకటిగా నిలుస్తుందన్నారు. ప్రపంచ వ్యాపార పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో ఎగుమతులపై అధిక పన్నులు ఉన్న ఈ సమయంలో మొదటిసారి మొత్తం కలెక్షన్‌పై 60 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నామని పేర్కొన్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన డిజైనర్ రగ్స్ మరింత అందుబాటులోకి వచ్చాయన్నారు. రగ్ ఉత్సవ్ కేవలం డిజైన్ ప్రదర్శన మాత్రమే కాదన్నారు. ఈ అద్భుత కళాఖండాలను ఇంతకుముందెన్నడూ లేని ధరల్లో అందిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే రగ్ ఉత్సవ్ ఒక ప్రత్యేకమైన సేవా కార్యక్రమానికి అనుసంధానమై ఉంటుందన్నారు. 2025లో ఈ ఉత్సవం ద్వారా వచ్చిన ఆదాయం గ్రామీణ నేతదారుల ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాలు, శుద్ధమైన తాగునీటి వసతులు ఏర్పాటు చేయడానికి వినియోగిం చనున్నామని తెలిపారు. రగ్ ఉత్సవ్ 2025ను జైపూర్ రగ్స్ ప్రధాన షోరూమ్‌లలో ఉంటాయ న్నారు. ఢిల్లీ, ముంబై, చెన్నై, రాయ్‌పూర్, జైపూర్, గుజరాత్, బెంగళూరులో కూడా కలవన్నారు. జైపూర్ రగ్స్ www.jaipurrugs.com/in వెబ్‌సైట్ ద్వారా కూడా అందుబాటులో కలవన్నారు.




## బిగ్ బాస్ తెలుగు భాగస్వామి గా హైయర్ ఇండియా

**విజయవాడ మేజర్ న్యూస్:** వరుసగా 16 సంవత్సరాలుగా ప్రపంచ నెం.1 మెజర్ అప్లయెన్సెస్ బ్రాండ్‌గా నిలిచిన హైయర్ అప్లయెన్సెస్ ఇండియా, ఈ ఏడాది కూడా ప్రేక్షకుల ముందు వెలుగులోకి వస్తోందని హైయర్ అప్లయెన్సెస్ ఇండియా అధ్యక్షుడు ఎన్‌ఎస్ సతీష్ తెలిపారు. స్టార్ మా ఎస్ డీ & హెచ్ డీలో, జియోహాట్‌స్టార్‌లో ప్రసారమవుతున్న బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 కు అసోసియేట్ స్పాన్సర్‌గా హైయర్ మరోసారి ముందుకొచ్చిందన్నారు. దక్షిణ భారతదేశంలో అత్యంత ఆదరణ పొందిన ఈ రియాలిటీ షోతో భాగస్వామ్యం ద్వారా, తెలుగుభాషా ప్రేక్షకులతో తమ అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలనే హైయర్ సంకల్పాన్ని ఇది ప్రతిబింబిస్తోందని చెప్పారు. ఈ భాగస్వామ్యంతో హైయర్ ఎల్ ఈ డి టీవీలు, ఫ్రిజ్‌లు, ఎయిర్ కండీషనర్లు బిగ్ బాస్ ఇంటి లోపల ప్రతిష్ఠాత్మకంగా ప్రదర్శించబడతాయన్నారు. మోర్ క్రియేషన్ మోర్ పాజిబిలిటీస్ అనే తత్వాన్ని ప్రతిబింబిస్తూ, షోలోని సహజమైన సమీకరణల ద్వారా హైయర్ యొక్క ఆధునిక ఏ ఐ సాంకేతికత, సృజనాత్మకత, ప్రీమియం డిజైన్‌లను నేరుగా ప్రేక్షకుల గృహాలకి చేరువ చేస్తుందన్నారు. ఇకపోతే, హైయర్ తన వాషింగ్ మెషీన్‌లను కేంద్రీకరించి ప్రత్యేకంగా రూపొందించిన ఇన్ హౌస్ టాస్క్ ద్వారా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుందని, ఈ యాక్టివేషన్ ద్వారా హైయర్ యొక్క అత్యాధునిక లాండ్రీ టెక్నాలజీని చూపించడమే కాకుండా, ప్రతిరోజు పనులను మరింత సులభం, స్మార్ట్‌గా మార్చే బ్రాండ్ నిబద్ధతను కూడా హైలైట్ చేస్తుందన్నారు. ఇలా వినోదభరితమైన, గుర్తుండిపోయే క్షణా లను సృష్టించడం ద్వారా, హైయర్ ప్రేక్షకులతో పాటు పోటీదారులతోనూ భావోద్వేగ అనుబంధాన్ని మరింతగా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుం దని చెప్పారు. “బిగ్ బాస్ తెలుగుతో మా గత భాగస్వామ్యం అద్భుత విజయాన్ని సాధించిందని, వరుసగా ఇది ఆరోసారి భాగస్వామ్యం అని చెప్పారు.

## గణేష్ ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలి

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** గణేష్ ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆకాంక్షించారు. విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలో వినాయక చవితి పండుగ మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుడిని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణనాథుడికి భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విఘ్నేశ్వరుడు మీ జీవితాల్లోని అన్ని అడ్డంకులను తొలగించాలని, ఇంట్లో శుభం జరగాలని, సుఖసంపదలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గణపతి సేవాసమితి సభ్యులు, భక్తులు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీని కలిసిన అంకెం ఇందిరా ప్రియదర్శిని



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన జి.కొండూరుకు చెందిన విజయవాడ పార్లమెంట్ తెలుగు మహిళ కార్యదర్శి అంకెం ఇందిరా ప్రియదర్శిని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులయ్యారు.విజయవాడ గురునానక్ కాలనీలో గల విజయవాడ పార్లమెంటు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ని ఆమె గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేశినేని శివనాద్(చిన్ని), అంకెం ఇందిరా ప్రియదర్శిని, ఆమె భర్త అంకెం సురేష్ గని శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ యోగానంద స్వామి వారి ఆలయానికి భక్తులచే షెడ్డు ఏర్పాటు..

**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 5,మేజర్ న్యూస్:** పంచ నరసింహ క్షేత్రాలైన వేదాద్రి వేదాచాల కొండపై వేంచేసియున్న శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి పల్నాడు జిల్లాకు మేడికొండూరు గ్రామానికి చెందిన వై అప్పారావు వారి సోదరులతో స్వామి వారి దేవాలయం వద్ద భక్తులు సేదతీరెందుకు రేకుల షెడ్డు ఏర్పాటు చేయడం అభినందనీయం. ఇటీవల ఆలయ ఈవో చేస్తున్న పలు రకాల అభివృద్ధి కార్యక్రమాల ఏర్పాటుకు కృషి చేస్తున్నందున దాతలు ముందుకు వస్తున్నారని, స్వామివారి ఆలయ ప్రాంగణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అతి త్వరలో ప్రారంభిస్తున్నామని ఆలయ ఈవో తెలిపారు.



## విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి కృషి చేయాలి

### జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు అన్నారు. మచిలీపట్నం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అన్నం వీరరాఘవమ్మ, రాఘవరావు కళ్యాణమందిర్ లో గురుపూజోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రశేఖర రావు మాట్లాడుతూ అధ్యాపక వృత్తి నుండి రాష్ట్రపతి పదవి వరకు ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా గురుపూజ మహోత్సవం జరుపుకోవడం ముదావహమన్నారు. ప్రధానమంత్రి మోడీ రెండు చేతులతో నమస్కరించడం మన సంస్కృతి సాంప్రదాయాన్ని తెలియజేస్తుందన్నారు. ఉపాధ్యాయులు వృత్తిపరంగా బోధించడంతోపాటు విద్యార్థుల జీవన సాఫల్యానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు వృత్తితో పాటు ప్రవృత్తులలో కూడా రాణించే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షలకు అనుగుణంగా ఉపాధ్యాయులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పి-4 లో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం పదిమంది ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అవోపా అధ్యక్ష కార్యదర్శులు డిఎస్వి రమణమూర్తి, గోళ్ళ ప్రసాద్, వాసవి కోపరేటివ్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ ఏబీవీ రత్న ప్రసాద్, కృష్ణవేణి ఐటిఐ వ్యవస్థాపకుడు కొత్తగుండు రమేష్, కలం కౌంటర్ అధినేత సిహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమాజ నిర్మాణానికి దిశ నిర్దేశం చేసే మార్గదర్శకులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఉపాధ్యాయ దినోత్సవం సందర్బంగా శుక్రవారం కళాశాలలో 150 మంది విద్యార్థులకు లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో బహుమతులు అందచేశారు. ప్రిన్సిపాల్ పి.లక్ష్మి మాట్లాడుతు కృష్ణజిల్లాలో అత్యధిక ప్రవేశలు కాకుండ రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో మా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు అని అన్నారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు మాట్లాడుతు జిల్లాలో ఉత్తమ అధ్యాపకులు అవార్డు ను మేదమేటిక్స్ అధ్యాపకులు సుందర లక్ష్మి శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా అందుకోవడం కళాశాలకు గర్వకారణం అన్నారు. ప్రభుత్వ కళాశాలలకు నేటి ప్రభుత్వం అన్ని సౌకర్యంలు సమ కూర్చడం అభినందనీయం అని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్బంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి కళాశాల సిబ్బంది విద్యార్థులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొమ్మారెడ్డి స్కూల్‌లో ఘనంగా సర్వేపల్లి జయంతి వేడుకలు



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** కొమ్మారెడ్డి పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుడు, మాజీ రాష్ట్రపతి, దివంగత డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈవేడుకల్లో ముందుగా పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించి ఉపాధ్యాయుల విశిష్టత, వారి యొక్క త్యాగనిరతిని తెలియజేశారు. డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ మాట్లాడుతూ డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఆదర్శప్రాయమని, రాధాకృష్ణన్ జీవిత విశేషాలను, గొప్పదానాన్ని తెలియజేశారు. తమ పాఠశాలలోనే చదువుకుని ఇక్కడే ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కొందరిని సన్మానించుకోవడం ఎంతో ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఈసందర్భంగా తనకు విద్య నేర్పిన గురువులను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ స్కూల్ సెక్రెటరీ,కరెస్పాండెంట్ కె.యస్.వి.జి. శోభ యంగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి ఎన్.శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### దేశ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా

# మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బోధనలు, రచనలు





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బోధనలు, రచనలు తరతరాలుగా ప్రభావితం చేస్తున్నాయని రాష్ట్ర కార్మికులు బాయిలర్లు ఫ్యాక్టరీలు బీమా వైద్య సేవల శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ కొనియాడారు.శుక్రవారం ఉదయం నగరంలోని జడ్పీ కన్వెన్షన్ హాలులో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గురుపూజోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత వందేమాతరం ప్రార్థన గీతంతో కార్యక్రమం మొదలు కాగా మంత్రి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు,రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మలతో కలిసి పూర్వపు రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహ మూర్తికి పూలమాలు, పుష్పాలతో అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. తదుపరి మంత్రి జ్యోతి ప్రజ్వలన గావించి సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును వ్యక్తిగతంగా తనకోసం కాకుండా ఉపాధ్యాయ దినోత్సవం పేరుతో ఉపాధ్యాయులందరికీ గౌరవం దక్కేలా నిర్వహించడం అభినందనీయమన్నారు. 1994 సంవత్సరంలో యునెస్కో అక్టోబర్ 5వ తేదీని ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం గా ప్రకటించినదని, అయితే సెప్టెంబర్ 5 వ తేదీన దేశంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రతి మనిషి జీవితంలో ఒక గురువు ఉంటారని, ఒక్కో దశలో వారు ఒక్కో ప్రభావం చూపుతూ ఉంటారన్నారు. తన జీవితంలో కూడా గణపతి మాస్టారు ప్రభావితం చేశారని, తనలో నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, సేవ చేసే గుణం ఉందని, కోపం కాస్త తగ్గించుకోవాలని, బి ఎల్ చేయాలని, బంగారు భవిష్యత్తు ఉంటుందని మార్గ నిర్దేశం చేశారన్నారు.ఆయన ఆశీస్సులు వలన ఈ స్థాయికి చేరుకున్నానని, వారిని ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటానన్నారు. ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తి కంటే గొప్ప వృత్తి మరొకటి లేదని ప్రశంసించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాల పరిపాలనలో 13 డీఎస్సీలను నిర్వహించారని, సుమారు 1,80,208 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారన్నారు. ఆయనకు విద్యావ్యవస్థ పట్ల ఎంత గౌరవం ఉందనడానికి ఇదే నిదర్శనం అన్నారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించి షైనింగ్ స్టార్స్ పేరుతో జిల్లాలో 161 మంది విద్యార్థులకు 20వేల రూపాయల చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం 6 రకాల బల్ల విధానం పెట్టిందని, ఉపాధ్యాయులపై ఉన్న ఒత్తిడిని తగ్గించడానికి తమ ప్రభుత్వం వచ్చాక 9 రకాల బండ్ల విధానం తెచ్చి సులభతరం చేసిందన్నారు.

ప్రతిపక్షం 24 కేసులు పెట్టినప్పటికీ లెక్కచేయక ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తోందని,నియామక ఉత్తర్వులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించి మంచి ప్రయోజకులుగా సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఉపాధ్యాయులు ఎంతగానో తోడ్పడతారన్నారు. వారు తాము ఎంత బాధల్లో ఉన్న ఎన్ని కష్టాల్లో ఉన్న అన్నిటిని దిగమింగుకొని బాధ్యతగా విద్యార్థులకు మంచి చదువు చెబుతారని అందుకు తానే ఒక ఉదాహరణ అని తన జీవితంలో ఎదురైన సంఘటనలు వివరించారు.రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎవరూ సాటి రారని, విద్యార్థి దశలో విద్యావంతులను చేసి, మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దేది గురువులేనన్నారు. తల్లిదండ్రులతో పాటు గురువులు కూడా పూజించబడుతున్నారని అందుకే గురు బ్రహ్మ గురు విష్ణు: గురుదేవో మహేశ్వర అంటూ గురువులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తల్లిదండ్రులతో పాటు గురువులు కూడా దైవంతో సమానం అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కూడా అధ్యాపకులేనని తదుపరి వారు రాజకీయాల్లో చేరి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారన్నారు.రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ అక్షర రూపంలో ఉన్న ఒక సిరా చుక్క లక్ష మంది మెదడులకు పదును పెడుతుందని మహాకవి కాళోజి చెప్పినట్టు అక్షరాలను మాలలుగా చేసి విద్యార్థుల మెడలో వేసి ఆ బిడ్డల బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దే గొప్ప వ్యక్తులు ఉపాధ్యాయులు అన్నారు. సమాజ సేవ చేయడానికి ఒక ఐఏఎస్, ఐపీఎస్,రాజకీయ నాయకులే కాకుండా ప్రతి ఒక్కరికి విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తయారు చేసే దేవుళ్ళు ఉపాధ్యాయులన్నారు. పొరపాటున ఒక ఇంజనీర్ తప్పు చేస్తే ఒక భవనం కూలిపోతుందని, అదే ఒక ఉపాధ్యాయుడు తప్పు చేస్తే ఒక వ్యవస్థ కూలిపోతుందన్నారు. తల్లి తండ్రి గురువు దైవం అన్నారని ఆ విధంగా గురువుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎంతో మంది జీవితాలకు వెలుగై దారి చూపిన గొప్ప వ్యక్తులు ఉపాధ్యాయులన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ ఒకే జీవితంలో అన్నీ సాధించడం ఎవరివల్లా కాదని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ రోజుకు 20 గంటలు కష్టపడి ఉంటారని, అందుకే ఆయన ఉపాధ్యాయ జీవితంతో మొదలుపెట్టి దేశాధ్యక్ష పదవికి ఎదగగలిగారన్నారు. తాను పెద్దగా చదువుకోలేదని అయితే జీవితంలో ప్రతి ఒక్కరు నిరంతరం కష్టపడితే అంచలంచలుగా ఎదగగలమనేది తెలుసుకున్నానన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ క్రమశిక్షణ నీతి నిజాయితీ ప్రవర్తన మాట తీరు మనకు ఆదర్శం అన్నారు. తన పుట్టినరోజు తనకు సన్మానం చేయడానికి వచ్చినప్పుడు ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని ఆయన ప్రకటించడం ఉపాధ్యాయులందరికీ దక్కిన గౌరవం అన్నారు.

జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు మాట్లాడుతూ జీవితానికి దిశా నిర్దేశం చేసిన గురువులను ఎల్లప్పుడూ పూజించాలన్నారు. తాను కూడా ఉపాధ్యాయ వృత్తి నుండే వచ్చానని, తన చిన్నతనంలో గణితం విషయంలో వెనుకబడితే తన గురువు సులభంగా నేర్చుకునేటట్లు ప్రోత్సహించారని, ఆ తదుపరి గణిత ఉపాధ్యాయుడుగా, లెక్చరర్ గా విధులు నిర్వహిస్తూ గ్రూప్ వన్ పరీక్షలు రాసి డిఎస్పి అయ్యానని వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా, పక్కదారి పట్టకుండా శ్రద్ధతో గమనించి కౌన్సిలింగ్ ఇచ్చి వారిని సరైన మార్గంలో పెట్టాలని, క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కంకణ బద్దులు కావాలన్నారు.

డీఈఓ పి వి జె రామారావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చొరవతో నాకు సాధ్యమే అనే ఒక 60 మంది ఉన్నత స్థానాల్లోని వారి యొక్క జీవిత చరిత్రలు పిల్లలకి ప్రతిరోజు వినిపించమని ఒక ప్రత్యేక పుస్తకాన్ని సిద్ధం చేసి తయారు చేశారన్నారు. పిల్లలందరికీ కూడా ప్రార్థన సమయంలో వాళ్ళకి ఒక ఇన్స్పిరేషన్ స్టోరీస్ చెప్పడంతో పాఠశాల ప్రారంభం అవుతుందన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన స్వాగత నృత్యము,సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. తదనంతరం ఉపాధ్యాయులుగా ఎంపికైన 32 మందికి మంత్రి ప్రముఖులు అందరు కలిసి శాలువలు, ప్రశంసా పత్రము, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, జిల్లా విద్యాధికారి పివిజే రామారావు, విద్యాశాఖ డిప్యూటీ డీఈవోలు శేఖర్ సింగ్, పద్మారాణి, రవికుమార్, ఏడీలు రవుఫ్, విద్యాలత, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ జాకీర్ అహ్మద్, పలువురు పర్యవేక్షకులు, ఎంఈఓ లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# బీమా ప్రీమియంపై జి ఎస్ టి రద్దు చేయటం చారిత్రాత్మక విజయం



మచిలీపట్నం మేజర్ న్యూస్ : వ్యక్తిగత జీవితబీమా, ఆరోగ్యబీమా పాలసీలపై 18శాతంగా ఉన్న జి.ఎస్.టీ.ని రద్దు చేస్తూ ఈ నెల 3 వతేదీన జరిగిన 56వ జి.ఎస్.టీ. కౌన్సిల్ సమావేశం తీసుకున్న నిర్ణయాన్ని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ స్వాగతిస్తున్నది. మచిలీపట్నంలో నిర్వహించిన మీటింగ్‌లో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్య దర్శి జి. కిశోర్ కుమార్ మాట్లాడుతూ ఇన్సూరెన్సు ప్రీమియంపై జి.ఎస్.టీ.ని రద్దు చేయాలని డిమాండు చేస్తూ గత దశాబ్దకాలంగా ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎ.ఐ.ఐ.ఇ.ఎ) చేసిన పోరాటం విజయం సాధించిందన్నారు. జి.ఎస్.టీ.ని రద్దు చేయాలని కోరుతూ ఇన్సూరెన్స్ ఉద్యోగులు లక్షలాది పాలసీదారుల సంతకాలను సేకరించి ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ కు అందజేశారు. 2019లోనే నీతి ఆయోగ్ సభ్యులను కలిసి ఈ అంశంపై జోక్యంచేసుకోవలసిందిగా కోరారు. 209 మంది పార్లమెంట్ సభ్యులను కలిసి ఇన్సూరెన్సు ప్రీమియంపై జి.ఎస్.టీ. వలన కలిగే అనర్థాలను వివరించి, ఇన్సూరెన్సు ప్రీమియంపై జి.ఎస్.టీ. రద్దుకై కృషిచేయవలసిందిగా కోరారు. 2024 లోకూడా ఎ.ఐ.ఐ.ఇ.ఎ నాయకత్వంలో ఉద్యోగులు ప్రధాన రాజకీయపార్టీల నాయకత్వాలను కలిసి ఇన్సూరెన్సు ప్రీమియంపై జి.ఎస్.టీ రద్దు కోసం కృషి చేయవలసిందిగా అభ్యర్థించారు. 2019 నుండి ఇప్పటివరకు పలు దఫాలుగా ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ని కలిసి ఇన్సూరెన్సు ప్రీమియంపై జి.ఎస్.టీ.వలన కలిగే అనర్థాలనుగురించి వివరించారు. దేశ ప్రజలు, పట్టాదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఇన్సూరెన్సు ప్రీమియంపై జి.ఎస్.టీ.ని ఉపసంహరించుకోవలసిందిగా కోరారు. 11.07.2024న లోక్ సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కూడా ఇన్సూరెన్సు ప్రీమియంపై జి.ఎస్.టీ. విషయాన్ని ప్రస్తావించి, రద్దు చేయాలని కోరారు. 2024లో జులై నెలలో దేశవ్యాప్తంగా ఎ.ఐ.ఐ.ఇ.ఎ నాయకత్వంలో ఇన్సూరెన్స్ ఉద్యోగులు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 400 మంది పార్లమెంటు సభ్యులను కలిసి ఇన్సూరెన్సు ప్రీమియంపై జి.ఎస్.టీ. రద్దు చేయాలని మరోసారి కోరుతూ ప్రచారాందోళనా ఉద్యమాన్ని నిర్వహించారు.అనేమంది సీనియర్ క్యాబినెట్ మంత్రులను కూడా కలిసి చర్చించామన్నారు.ఫలితంగా జిఎస్టి కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్లో ప్రకటించారు.దేశ కార్మికోద్యమ చరిత్రలో ఇన్నిసార్లు ఇంత పెద్ద ఎత్తున పార్లమెంట్ సభ్యులను కలవటం ఒక అరుదైన సంఘటన అని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అభిప్రాయపడుతున్నది. సామాన్య ప్రజలకు ఆర్థిక భారంతగ్గి, ఇన్సూరెన్స్ సౌకర్యం ప్రజలకు చేరువ కావటానికి ఈ చర్య అవకాశం కల్పిస్తుంది.2047 నాటికి అందరికీ ఇన్సూరెన్స్ఇలసీ ఉండాలన్న ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యానికి ఈచర్య ప్రోత్సాహం కల్పిస్తుందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నది. ఇన్సూరెన్స్ వ్యాప్తికి దోహదపడే విధంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అభినందిస్తున్నది.ఎ.ఐ.ఐ.ఇ.ఎ ఆధ్వర్యంలో ఒక క్రమ పద్ధతిలో, ప్రజాస్వామ్యబద్ధంగా చేసిన ప్రచారం ఆందోళనా పోరాటం ఫలించింది.ఇది ఒక చారిత్రాత్మక విజయం.ఇందుకు సహకరించిన వారందరికీ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ధన్యవాదాలు తెలియ జేస్తున్నది.ఈ సమావేశంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.కిశోర్ కుమార్ తో బాటుగా, అధ్యక్షులు, జె.సుధాకర్, జాయింట్ సెక్రటరీ డి.వాసు, కోశాధికారి ఎల్.రాజశేఖర్, సహాయ కోశాధికారి, ఎ.శ్రీనివాసరావు, మచిలీపట్నం స్థానిక డివిజనల్ ఆఫీసు నాయకులు,వై.స్వామినాథ్ బ్రాంచి నాయకులు ఎస్.వి.రత్నారావు, బిహెచ్.మాధుర్, కోటేష్ బాబు, విజయ్ గణేష్, రాజా రావు, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు జరుగుతాయి

**ఆటో కార్మికులకు సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా హామీ.**



విజయవాడ, మేజర్ న్యూస్ : స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం కారణంగా ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, ఎన్నికల సందర్భంగా ఆటో మోటార్ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వర రావుని ఐఎఫ్ టియు ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నాయకులు, కార్మికులు వారి ఆఫీసులో కలిసి వినతి పత్రం అందించారు. బోండా ఉమా మాట్లాడుతూ ఆటో కార్మికులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబుతోనూ, లోకేష్‌తోను ఇదే విషయాలు మాట్లాడి ఉన్నానని, తప్పనిసరిగా జీవో నెంబర్ 21 రద్దుతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆటో కార్మికులకు భరోసా ఇచ్చారు. జరగబోవు అసెంబ్లీలో ఆటో కార్మికుల సమస్యల గురించి తప్పనిసరిగా మాట్లాడతానని తెలియజేశారు. అనేక సందర్భాల్లో ఆటో కార్మికుల విషయాలను అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించి న్యాయం జరిపించిన ఉమా ఇప్పుడు కూడా న్యాయం జరిపించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పోలారి, ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు దాది శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ పెద్దిరాజు, నాయకులు ముని శంకర్, శ్రీధర్ బాబు, యాదగిరి, వలి ఇంకా పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



## రాజకీయ గురువు గొర్రెపాటి గోపీచంద్‌కు టిడిపి నాయకులు ఘన సత్కారం..

మచిలీపట్నం మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి రాజకీయ గురువుగా ఎంతోమంది కి రాజకీయ భవిష్యత్తు కల్పిస్తూ యువతను రాజకీయాల్లో ప్రోత్సహిస్తున్న వ్యక్తి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ అని తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ దేవరపల్లి అనిత అన్నారు.గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం రాజకీయ గురువుగా ఎంతోమందికి రాజకీయ అనుభవాలు నేర్పుతూ యువతను రాజకీయాల వైపు నడిపించే గొర్రెపాటి గోపీచంద్ ను తెలుగు దేశం పార్టీ కార్పొరేటర్, దేవరపల్లి అనిత, తెలుగుదేశం పార్టీ నాయకులు, పి. వి. ఫణి కుమార్, షేక్ ఫిరోజ్ లు గొర్రెపాటి గోపీచంద్ ను ఆయన నివాసంలో గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం ఘనంగా సత్కరించి, యువతను రాజకీయాల వైపు మళ్ళించే విధంగా రాజకీయ గురువుగా కృషి చేస్తున్న గొర్రెపాటి గోపీచంద్ సేవలు మరువలేనివి అని వారు మాట్లాడుతూ, గురువు అంటే శిక్షణ జ్ఞానం అందించే వ్యక్తి అని, అలాంటి స్వభావాలు కలిగిన రాజకీయ గురువుగా గొర్రెపాటి గోపీచంద్ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావము నుండి ఎంతోమంది కి రాజకీయ శిక్షణ ఇచ్చి రాజకీయాల్లో మంచి అవకాశాలు కల్పిస్తున్న గొప్ప వ్యక్తి అన్నారు.గురుపూజోత్సవం అనేది గురువులను, గురు పరంపరను స్మరించుకుంటూ వారిని గౌరవించడానికి నిర్వహించే ఓ పవిత్రమైన ఉత్సవం అని, అలాంటి గురుపూజోత్సవం రోజున



రాజకీయ గురువుగా ఎంతో మందికి అవకాశాలు తెలుగుదేశం పార్టీలో కల్పిస్తూ యువతను ముందుకు నడుపుతున్న రాజకీయ గురువు గొర్రెపాటి గోపీచంద్ ను సత్కరించడం జరిగింది అన్నారు.గొర్రెపాటి గోపీచంద్ తెలుగు దేశం పార్టీలో యువతకు అన్ని రకాల ప్రోత్సాహాన్ని ఇస్తూ ముందుకు నడుపు తున్న గురువుగా ఆయనకు భగవంతుడు మంచి ఆయురారోగ్యాలు ఇవ్వాలని భగవంతుని కోరుకుని, రాజకీయ గురువుగా గొర్రెపాటి గోపీచంద్ ను సత్కరించడం జరిగింది అన్నారు.

## నవసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం



జి కొండూరు మేజర్ న్యూస్ : నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి డైమండ్ అపార్ట్మెంట్ ఆవరణలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుల విశిష్ట సేవలను గౌరవించేందుకు శుక్రవారం జరిగిన సన్మాన కార్యక్రమం లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. గురుపూజోత్సవంలో భాగం గా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్రాంత ఉపాధ్యాయులు సూర్యదేవర సురేష్ కుమార్ (రిటైర్డ్ టీచర్, జెడ్.పి.హెచ్.ఎస్, పాల్వంచ), సూర్యదేవర జయశ్రీ (రిటైర్డ్ టీచర్, రెజినా కార్మెలి కాన్వెంట్ స్కూల్ పాల్వంచ), మరో విశ్రాంత ఉపాధ్యాయురాలు మంజులతో పాటు మరో ఇద్దరి ని సన్మానించారు.అనంతరం ఇస్కాన్ సలహాదారు, అపన్నహస్తం సభ్యుడు డాక్టర్ గంగాధర ఉల్లవపలి భగవద్గీత సెషన్ నిర్వహించారు. స్మార్ట్ ఆరో డైరెక్టర్, అపన్న హస్తం వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ సుశాంత్ కుమార్ నేతృత్వంలో జెఈఈ మెయిన్స్, నీట్, ఐ.ఏ.ఎస్ ప్రవేశ పరీక్షలకు సంబంధించి పేద విద్యార్థులకు ఉచిత ఆన్లైన్ కోచింగ్‌ను ఎమ్మెల్యే వసంత ప్రారంభించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన సింగంశెట్టి



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుడ్లవల్లేరు శ్రీసాయి విద్యా నికేతన్ పాఠశాల కరస్పాండెంట్, ప్రధానపాధ్యాయులు సింగంశెట్టి ఆదినారాయణ(చిన్న మాస్టారు)ను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. 1980వ సంవత్సరంలో విద్యా సంస్థను స్థాపించి, ఉపాధ్యావృత్తి లో ప్రవేశించిన ఆదినారాయణ మాస్టారు 45సంవత్సరాలపాటు ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చి చిన్నమాస్టారుగా పేరొందారు. అదేవిధంగా ఎంతోమంది విద్యార్థులకు అక్షరాభ్యాసం చేసి ఉత్తమ పౌరులుగా, ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత సింగంశెట్టి ఆదినారాయణ మాస్టారుది. చిన్న మాస్టారు యొక్క విలువలతో కూడిన విద్యాబోధనతో అనేక మంది దేశ, విదేశాల్లో ఉన్నతమైన స్థానాల్లో ఉండడం విశేషం. యింతటి ఘనకీర్తి సాధించిన సింగంశెట్టి ఆదినారాయణ మాస్టారును ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అభినందిస్తూ ఉపాధ్యాయులు ఎస్కే రహీమా, ఎస్. సువర్ణ, సిహెచ్. వెంకటేశ్వరమ్మ, డి. కమలాదేవి, ఎన్. మహాలక్ష్మి, కె. కుసుమ, పి. దుర్గ, విద్యార్థులు ఆదినారాయణ మాస్టారును పూలమాలలతో, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే ఎంతోమంది పూర్వ విద్యార్థులు చిన్న మాస్టారుకు శుభాకాంక్షలు తెలిపారు.

## మంత్రి అచ్చెన్నాయుడుని కలిసిన కార్పొరేషన్ డైరెక్టర్లు



జి కొండూరు మేజర్ న్యూస్ : మైలవరం నియోజకవర్గం నుంచి రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంటల్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన అంకెం ఇందిరా ప్రియదర్శిని, లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ గా నియమితులైన దొండపాటి విజయ్ కుమార్, మైలవరం నియోజకవర్గ నాయకులతో కలిసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని విజయవాడ లోని వారి కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిసి మంత్రి ని శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు తెలియజేశారు, ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో పనిచేసిన ప్రతి కార్యకర్తను పార్టీ గౌరవిస్తుందని, మైలవరం నియోజకవర్గం నుంచి ఇద్దరు రాష్ట్ర డైరెక్టర్ లుగా అవకాశం రావడం అభినందనియం, పార్టీ కొరకు మరింత కృషి చేయాలని కోరారు.

## సేతురామమ్మల్ విద్యా మందిరంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు..

**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 5, మేజర్ న్యూస్ :** స్థానిక రాంక్ కో సిమెంట్స్ లోని సేతు రామమ్మమల్ విద్యా మందిరంలో శుక్రవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ కో సిమెంట్స్ యూనిట్ హెడ్ ఆశిష్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో గురువు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాడు. ఉపాధ్యాయులు...విద్యార్థుల తప్పులను సరిదిద్ది వారి జీవితాలను సన్మార్గంలో నడిపిస్తారు అని తెలియచేశారు. స్కూల్ కరెస్పాండెన్స్, సీనియర్ జి ఎం (అకౌంట్, అడ్మిన్) ఫరూక్ మొహమ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానంలోకి వెళ్ళాలి అంటే క్రమశిక్షణ, ఓర్పు చాలా అవసరం అని తెలియచేశారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు., ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామ్ కో సిమెంట్స్ సీనియర్ ప్రెసిడెంట్ ఆశిష్ కుమార్ శ్రీవాస్తవ, ప్రెసిడెంట్ (వర్క్స్) ఎస్ వి ఆర్ కె మూర్తి రావు, స్కూల్ కరెస్పాండెన్స్, సీనియర్ జి ఎం (అకౌంట్, అడ్మిన్) ఫరూక్ మొహమ్మద్, జి ఎం (హెచ్ ఆర్) ఎం రామ కృష్ణ సాయి, జి ఎం (ఎలక్ట్రికల్) పి రఘురామ్, స్కూల్ ప్రిన్సిపల్ నారాయణి, విద్యార్థులు, ఉపాధ్యాయలు, తల్లిదండ్రులు పాల్గొనారు.

## మిలాద్ ఉన్ నబీ ముస్లిం సోదరుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మిలాద్ ఉన్ నబీ ముస్లిం సోదరుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాదు ఆకాంక్షించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణలకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ముందుగా "మిలాద్-ఉన్-నబీ" పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కొండపల్లిలోని హజరత్ సయ్యద్ షా బుఖారి బాబా వారి దర్గాలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాదు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్థాన పీఠాధిపతి అల్తాఫ్ బాబా ఎమ్మెల్యే కృష్ణ ప్రసాదును ఘనంగా స్వాగతించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మహ్మమద్ ప్రవక్త తన జీవితంలో మానవాళికి ప్రేమ, సోదరభావం, ధర్మం పై స్ఫూర్తి కలిగించటంతో పాటు తోటివారికి పట్ల విశ్వాసం, నమ్మకం, ప్రేమ, కరుణతో ఉండాలని సూచించారు. మనం సేవ చేసినప్పుడే మన లక్ష్యం మహ్మమద్ ప్రవక్త లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. నీతి, నిజాయితీ, ప్రేమ, త్యాగం లాంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ జీవితం కొనసాగించిన మహమ్మద్ ప్రవక్త ప్రవచించిన సూత్రాలను పాటించేందుకు ప్రేరణ కల్పించేది 'మిలాద్ ఉన్ నబీ'. సాటి వారిని గౌరవిస్తూ, వారి ఆకలి తీర్చే పవిత్ర ఆశయాలు కొనసాగాలి. అందుకు ముస్లిం సోదరులు ముందు వరుసలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారి నిత్యన్నదాన పథకమునకు విరాళం.

**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 5, మేజర్ న్యూస్ :** తిరుమలగిరి గ్రామంలో తిరునగరి కొండపై వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుచున్న నిత్యాన్నదాన పథకమునకు నందిగామ వాస్తవ్యులు గురుజు సౌర్య రూ.25,116/- రూపాయలు శుక్రవారం నిత్య న్నదాన పథకానికి విరాళంగా అందజేసినారు.వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ సిబ్బంది శ్రీ స్వామివారి ప్రసాదములు శేష వస్త్రములు అందజేయడం జరిగినది. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 7వ తేదీ ఆదివారం రాత్రి రావుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం మూడు గంటల నుండి శ్రీ స్వామి వారి దేవస్థానం మూసివేత. మరలా ఎనిమిదో తేదీ సోమవారం నాడు ఆలయ శుద్ధి అనంతరం ఉదయం 9:30 నిమిషాలకు భక్తులకు శ్రీ స్వామి వారి దర్శనం పునః ప్రారంభమగునని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి నూతక్కి వెంకట సాంబశివరావు తెలియజేశారు.

## శ్రీ తిరుపతమ్మ అమ్మవారి అన్నదానానికి విరాళం

**పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 5,మేజర్ న్యూస్ :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగు నిత్య అన్నదాన పథకానికి, ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా, తోటవల్లూరు మండలం, దేవరపల్లి గ్రామ వాస్తవ్యులు లంకే భార్గవ్ గోపాల్ శ్రీ అమ్మవారి నిత్య అన్నదాన పథకములకు10,116 రూపాయలు విరాళముగా ఆలయ సూపర్డెంట్,లక్ష్మణ్ కు అందజేశారు.వారికి ఆలయ ఇన్స్పెక్టర్ బద్ధుల కృష్ణమోహన్ అర్చకులు వేద పండితుల చే వేద ఆశీర్వదించేసి అమ్మవారి శేష వస్త్రములు, తీర్థ ప్రసాదములు అందజేశారు.అని ఆలయ ఈవో ఒక ప్రకటనలో తెలిపారు.

## కోడూరు అవనిగడ్డ ప్రధాన రహదారిలో బైక్ యాక్సిడెంట్

**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ మురామేస్త్రి బత్తుల నాగరాజు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం. విశ్వనాథపల్లి గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. అవనిగడ్డ నుంచి విశ్వనాథ పల్లి బైక్ పై వెళుతున్న సమయంలో అదుపు తప్పి పడిపోవడంతో తలకి బలమైన గాయం అవడంతో చనిపోయాడని స్థానికులు చెబుతున్నారు అతనికి భార్య ఒక్క కుమారుడు భవానీ శంకర్, ఉన్నారు భార్య కుమారుడు బోరున విలపిస్తున్నరు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సామినేని ఉదయభానుని కలిసిన మనుబోలు శ్రీనివాస రావు



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ సమన్వయకర్త బాధ్యతలు నుండి తప్పుకుంటున్నట్లు సోషల్ మీడియాలో లెటర్ వచ్చిన నేపథ్యంలో జనసేన పార్టీ ఆదేశానుసారం ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభానుని విజయవాడలో జనసేన కార్యాలయంలో శుక్రవారం కలిసి వివరణ ఇచ్చిన తిరువూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు. ఈ సందర్భంగా మనుబోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసైనికులకు జరుగుతున్న అన్యాయం గురించి ఆవేదనతోనే అలా చేయాల్సి వచ్చిందని జిల్లా అధ్యక్షునికి వివరణ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయానికి తోడుగా మొదటి నుంచి పనిచేసే జనసైనికులు ఎవరూ కూడా నిరూత్సాహానికి గురి కావద్దని, కూటమి 10 సంవత్సరాలు ఉంటుందని పవన్ కళ్యాణ్ చెప్పిన నేపథ్యంలో జన సైనికులు ఎవ్వరూ భావోద్వేగానికి లోనై సోషల్ మీడియాలో స్పందించవద్దని పార్టీ కోసం పనిచేసే నీలాంటి జనసైనికులను జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వదులుకోవడానికి సిద్ధంగా లేరన్నారు. మార్పు రావడం కోసం కొంత సమయం వేచి చూడాలని ధైర్యం చెప్పారు. జనసేన పార్టీ తిరువూరు సమన్వయకర్త, జిల్లా కార్యదర్శి బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా వైదొలుగుతున్నానన్న ప్రకటనను వెనుకకు తీసుకోవాలని, అలానే జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లాలని ఆలోచన కూడా విరమించుకోవాలని అలాంటి భావోద్వేగానికి లోనయ్యే ప్రకటనలు భవిష్యత్తులో చేయవద్దని శ్రీనివాసరావుకు నచ్చజెప్పారు. అలానే త్వరలో విజయవాడలో జిల్లా కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు, త్వరలో కార్యాలయంలో ప్రతి ఒక్క జన సైనికుడికి అందుబాటులో ఉంటానని తెలిపారు.

పార్టీ బలోపేతంతో అదే క్రమంలో కూటమి ఐక్యతే లక్ష్యంగా తిరువూరు నియోజకవర్గంలో మొదటి నుంచి పనిచేస్తున్న జనసైనికులు, కొత్తగా వస్తున్న జనసైనికులు అందర్నీ కలుపుకుంటూ అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ప్రతి ఆదివారం మండల స్థాయిలో ఒక సమావేశం ఏర్పాటు చేసుకోవాలని ఆ సమావేశ వివరాలను అందజేయాలని శ్రీనివాసరావు కు ఆదేశించారు.




## కర్లపాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ

**జగ్గయ్యపేట: సెప్టెంబర్ 5 మేజర్ న్యూస్ :** కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు, నిరు పేద మహిళలకు, వయోవృద్ధులకు పదివేల రూపాయల విలువైన పౌష్టికాహారాన్ని శుక్రవారం అందజేయడం జరిగిందని ఆ సంస్థ వ్యవస్థాపకులు, ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ నిర్వహణ కమిటీ సభ్యులు, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు.ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్లపాటి మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ప్రతి మాసము క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేసు రామచందర్ సహకారాన్ని అందించగా శ్రేయస్సు సిబ్బంది లక్ష్మి, ట్రస్ట్ ప్రతినిధులు రాయపూడి వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, ట్రస్ట్ సిబ్బంది పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళేశ్వర స్వామి వారి పవిత్రోత్సవములు



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని శ్రీకాకుళం వేంచేసి ఉన్న శ్రీ ఆంధ్ర మహావిష్ణు దేవాలయంలో శ్రీకాకుళేశ్వర స్వామి పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవంగా ఉత్సవాలలో శుక్రవా రం ఉదయం 7 గం"కు అగమశాస్త్రోక్తంగా విశ్వ క్సేన పూజ, పుణ్యావచనం,ఆగ్నాథారాధన, అష్టోత్తర శత కలశ ఆరాధన, అష్టోత్తర శత కలశ స్నపన అలంకరణ, విశేష హోమములు, పవిత్ర ఆరోహ ణ కార్యక్రమములు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆధ్వర్యంలో, ఆలయ అధికారి తోట చెన్నకే శవ పర్యవేక్షణలో, అగ్నిహోత్రం భాస్కరాచా ర్యులు, శ్రీమాన్ ముత్తేవి వెంకట సత్యనారాయణా చార్యులు సారధ్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తుల ఆధ్యాత్మిక శ్రేయస్సు, లోకకల్యాణం, సకల జన సుఖశాంతుల కొరకు జరుగుతు న్న ఈ పవిత్రోత్సవములలో భక్తులు విరివిగా పాల్గొని, శ్రీకాకుళేశ్వర స్వామి వారి దర్శనం చేసుకొని తీర్థప్రసాదములు స్వీకరించారు.

## తాడంకిలో వినాయకునికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని తాడంకి గ్రామంలో గల సగర రామాలయంలో వినాయక నవరాత్రుల సందర్భంగా పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శుక్రవారం ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో కూడా కుమార్ రాజా పాల్గొని కొద్దిసేపు గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నిబద్ధతతో వినాయక చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న నిర్వాహ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు జక్కా శ్రీనివాసరావు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రతిభా పురస్కారం అందుకున్న డాక్టర్ జ్ఞాన సుందరి

**ఏ కొండూరు. సెప్టెంబర్ 5. మేజర్ న్యూస్ :** హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ చైర్ పర్సన్ డాక్టర్ జ్ఞాన సుందరి సమాజానికి ఆమె చేస్తున్న సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ వారు గ్లోబల్ పీస్ బ్రాండ్ అంబాసిడర్ 20 25 గాను అవార్డు ప్రధానం చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం గణపవరం గ్రామానికి చెందిన నిరుపేద రైతు కుటుంబానికి చెందిన డాక్టర్ జ్ఞాన సుందరి భారతదేశ రాజ్యాంగం ద్వారా మహిళలకు హామీ ఇవ్వబడిన లింగ సమానత్వం, విద్యా,ఆరోగ్యం, ఆస్తి,రాజకీయ, భాగస్వామ్యం సమాన వేతనం, వివక్షత నుండి స్వేచ్ఛ వంటి అనేక రకాల హక్కులను ఈ హక్కులు మహిళల గౌరవం భద్రత సమాజంలో స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలపై బాసటగా నిలిచారు. అక్రమాలు, లైంగిక వేధింపులు, గృహహింసలు, మహిళలపై, మైనర్ బాలికలపై దాడులు, అలాగే స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులతో కలిసి ఎస్సీ ఎస్టీ నిరుపేదలైన గిరిజనులకు బియ్యం నిత్యవసర వస్తువులు, దుస్తులు, పుస్తకాలు, దుప్పట్లు, వారి స్థితిని గుర్తించి వారికి బాసటగా నిలుస్తున్నారు. బాధిత నిరుపేద మహిళలకు న్యాయం జరిగే వరకు వారి జీవితాలను మెరుగుపరచడానికి అవిశ్రాంత ప్రయత్నాలు, ఉద్యమ స్ఫూర్తితో బాసటగా నిలిచి ఆంధ్ర తెలంగాణలో మారుమూల గ్రామాల్లో ఎన్నో అలుపు పెరగని పోరాటాలు చేస్తున్నారు. హరించకు పోయిన మానవ హక్కులు యాచన ద్వారా రావని దానికి పోరాటమే సరైన మార్గమని బలంగా నమ్మి సమాజంలో మహిళలకు




జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తి సాంఘిక అసమాన తలను రూపుమాపటానికి బాధిత మహిళల పక్షాన ఆమె మహావృక్షమై నిలిచారు. హక్కుల సాధనకై నిరంతరం బాసటగా నిలుస్తున్నారు. ఆమె సేవలను గుర్తించి 2025 సంవత్సరంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కళారంగా స్వచ్ఛంద సేవా సంస్థలు, ఆమెకు ఇప్పటివరకు సుమారుగా 300 పైగా సేవ సత్కారాలను ఆమె అందుకున్నారు. 20 25 సంవత్సరంలో ఇంటర్నేషనల్ ఇనిస్ట్యూట్ బ్రాండ్ అంబాసిడర్ గా సత్కారం అందుకున్న జ్ఞాన సుందరి కు మైలవరం నియోజకవర్గంలోని స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రజా సంఘాలు ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

# అనారోగ్యంతో ఉన్న పేదలకు వరం లాంటిది సీఎంఆర్ఎఫ్



**పామర్రు మేజర్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు వైద్య సహాయం పొందేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం లాంటిదని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండల కేంద్రమైన పామర్రు లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి చికిత్స అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే కుమార్ రాజా స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్నా ఆర్థికంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధృఢ నిశ్చయంతో ఉన్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు కోట్లాది రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అందజేసినట్లు తెలిపారు. పామర్రుకు చెందిన రెడ్డి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు 1,70,632 రూపాయల చెక్కును వర్ల కుమార్ రాజా లబ్ధిదారుని గృహమునకు వెళ్లి అందించారు. అలాగే చిలంకుర్తి భరత్ లీల 40,786 రూపాయలు, పోతన లక్ష్మీ నాంచారమ్మ 30,900 రూపాయలు, చొప్పరపు అలగా నాగ సుందర మహేశ్వరి 35వేల రూపాయలు, పామర్తి తనూష 10వేల రూపాయలు ముద్దుల మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయా కుటుంబాల ఇళ్ళకు వెళ్లి కుమార్ రాజా అందించారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, చాట్ల నరేష్ లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూషణగుళ్ళలో బాబు షూరిటి మోసం - గ్యారంటీ కార్యక్రమం



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గ పెదపారుపూడి మండలం భూషణగుళ్ళ గ్రామంలో మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ "బాబు షూరిటీ ం మోసం గ్యారంటీ" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీలతో సహా వందకు పైగా హామీలను ప్రకటించారని, అయితే అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు కాలేదని విమర్శించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పార్టీ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, పేద కుటుంబాలకు ఇంటి పట్టాలు అందజేసినట్లు ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిందని, ఈ మోసాలను ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలు స్కాన్ చేసి చంద్రబాబు చేసిన మోసాల గురించి తెలుసుకోవాలని కైలే అనిల్ కుమార్ సూచించారు. అనంతరం గ్రామ నాయకులతోను కార్యకర్తలతోను చర్చించి గ్రామ పార్టీ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా కొర్ని పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శులుగా దేవరకొండ శామ్యూల్, చేబ్రోలు నాగేశ్వరరావు, మిటికల ఆంజనేయులు, కలపాల రాజేంద్ర కుమార్, కార్యదర్శులుగా కాకా రమేష్, మల్లెబోయిన రాకేష్, దోనె హరీష్, రాజబోయిన రాజేంద్రప్రసాద్ లను నియమించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ గోగం సురేష్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఆల రమేష్, రాష్ట్ర పంచాయితీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి నామా వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ స్పోక్స్ పర్సన్ చీకుర్తి వరప్రసాద్, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ముల్పూరి హరీష, సీనియర్ నాయకులు గోళ్ళ సోమేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ చేబ్రోలు సుజాత, మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సమాజ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

అవనిగడ్డ మేజర్ న్యూస్ : సమాజ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం అవనిగడ్డ వంతెన సెంటరులో ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, తెలుగు జాతి రత్నం స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీ కృష్ణారావు విగ్రహానికి విశ్రాంత ఉపాధ్యాయులు గుడిసేవ విష్ణుప్రసాద్, కూనపరెడ్డి చంద్రశేఖర్, బడే వెంకట సుబ్బారావు, అన్నపరెడ్డి నాగ చెంచయ్య, విశ్వనాధపల్లి శ్రీనివాసరావు, సీహెచ్.రాఘవులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. గురు పూజోత్సవం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా వారిని కూటమి నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి నిర్వహణ కమిటీ, గాంధీక్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గాంధీక్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షులు మాదివాడ రత్నారావు, కోసూరు నాగమల్లేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీలు బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, వీర మహిళ తుంగల లక్ష్మి, కూటమి నాయకులు బండే రాఘవ, ఘంటసాల కన్నయ్య, అన్నపరెడ్డి వెంకటస్వామి, పర్చూరి దుర్గాప్రసాద్, అన్నపరెడ్డి రాందాస్, యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు (చిన్నా), కూరాకుల శివప్రసాద్, కమ్మిలి సాయిభార్గవ, షేక్ మొగల్ మురాద్ బేగ్, బడే సుబ్బారావు, కంచర్ల ఆనంద్, గుగ్గిలం శ్యాంకుమార్, ముళ్లపూడి శ్రీను, మైలా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా వాడకంపై రైతులకు సలహాలు అందించిన ఆర్డిఓ హేలా షారోన్

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం ఐనంపూడి గ్రామంలో రైతులకు యూరియా వాడకం విధానం గురించి ఉయ్యూరు రెవిన్యూ డివిజన్ అధికారి బి.ఎస్.హేలా షారోన్ పలు సూచనలు అందించారు. గ్రామానికి విచ్చేసిన ఆమె రైతులతో కొద్దిసేపు మాట్లాడి వారికి యూరియా అందడం లేదనే అపోహలను విడనాడాలని సూచించారు. రైతులు తమ వరి పంటలకు తొలివిడత ఎకరానికి 30 కిలోల చొప్పున యూరియా వినియోగించాలని సూచించారు. అలాగే నాట్లు వేసిన 30 రోజుల తర్వాత రెండవ విడత కోటాగా మరో 30 కిలోల యూరియాను, నాట్లు వేసిన 60 రోజుల తర్వాత మూడవ విడతగా మరో 30 కిలోల యూరియాను వేయవలసి ఉందని తెలిపారు. అయితే రైతులు అధికంగా యూరియా ను వాడటం వల్ల వచ్చే అనర్ధాలను కూడా ఆమె ఈ సందర్భంగా వివరించారు. రైతులు రెండు, మూడు విడతలను యూరియాకు బదులుగా నానో యూరియాను వినియోగించడం వల్ల అధిక దిగుబడులను సాధించే



అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు నానో ఏరియా వినియోగించడం పట్ల విముఖంగా ఉండటాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ సరైన అవగాహన లేని కారణంగా దాన్ని వినియోగించడం లేదని, వినియోగించి చూడటం వల్ల కలిగే ప్రయోజనాలను కూడా తెలుసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో తో పాటు తాసిల్దార్ సిహెచ్.నవీన్ కుమార్, రెవిన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## గూగుల్ కన్నా.... గురువు మిన్న...

**పామర్రు మేజర్ న్యూస్ :** ప్రతి వ్యక్తి జీవితానికి గురువు మాట నిజమైన బాట గా ఏర్పడుతుందని తెలుగు భాష సేవ ప్రభుత్వ అవార్డు గ్రహీత, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రీజియన్ చైర్మన్ పి.ఎం.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. గురువు చెప్పింది మదిలో ఉంటుందని గూగుల్ చెప్పింది ఆ క్షణం వరకే ఉండి మాయ మైపోతుందని, కనుక గూగుల్ కన్నా గురువు మిన్న అన్నారు. మానవత సంస్థ పామర్రు శాఖ అధ్యక్షులు ఎన్. త్రివిక్రమ రావు (ఎన్టీఆర్) అధ్యక్షతన శుక్రవారం పామర్రు శ్రీ అంకమ్మ తల్లి దేవస్థాన ప్రాంగణం లో జరిగిన గురు పూజోత్సవ సభ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం గురువులు జొన్నలగడ్డ హనుమకుమార్, ఎల్. పుష్ప, దావులూరి రాధాకృష్ణ మూర్తి, గాలింకి తాతారావు కందుకూరి లక్ష్మి కుమారి, యార్లగడ్డ మృదుల, శ్రీనివాసరావు, వెంకట నారాయణ లను వేద ఆశీర్వాదం తో సన్మానం చేసి జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రతినిధులు సీతాల ప్రసాద్, పామర్తి వెంకట నారాయణ, పామర్రు కార్యదర్శి అరిగెలబాలుడు, కోశాధికారి బీమవరపు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పామర్రు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో...** సమాజం అభివృద్ధి చెందాలన్నా, వ్యక్తి ఉన్నత అభ్యున్నతికి ఎదగాలన్నా ఉపాధ్యాయ బోధన, వారి కృషి కారణమని అలాంటి గురువులను దైవంగా భావించి సత్కరించుకోవటం లయన్స్ క్లబ్ భాగ్యమని పామర్రు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.బి.వి. అప్పారావు పేర్కొన్నారు. పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షులు నవులూరి వెంకయ్య అధ్యక్షతన శుక్రవారం స్థానిక ఎస్.వి.ఎస్ స్కూల్ ప్రాంగణం లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురు పూజ నిర్వహించారు. ఉపాధ్యాయులు మురళి కృష్ణ, సుబ్బమ్మ, రాము, వెంకటేశ్వరరావు, అరవపల్లి రావు, శివ రామకృష్ణ లను సన్మానించారు. ఈ కార్యక్రమం లో లయన్స్ ప్రతినిధులు బైసాని నాగేశ్వర రావు, పి.ఎం.ఎస్.ప్రసాద్, లంకపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న గణపతి దేవస్థాన మండపంలో కుంకుమ పూజ



**నాగాయలంక సెప్టెంబర్ 5 మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లాలో ప్రసిద్ధిగాంచిన నాగాయలంక గ్రామంలోని శ్రీ ప్రసన్న గణపతి నవరాత్రి ఉత్సవ పందిరిలో, మహోత్సవాలలో భాగంగా శ్రీ లక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజ కార్యక్రమం బ్రహ్మశ్రీ కూరపాటి రాధాకృష్ణ మూర్తి బ్రహ్మోత్వం లో అత్యంత వైభవంగా నయ నాంధ కారముగా శ్రీ లక్ష్మీదేవి అమ్మవారికి,108 లక్ష్మి కలశము లతో సమూహిక కుంకుమ పూజా మహో త్సవము అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళామణులు చేసితిరి. కార్యక్రమంలో భాగంగా,శ్రీ లక్ష్మీ అమ్మవారి రూపు చిట్టా ధనలక్ష్మి జ్ఞాపకార్థం వారి భర్త చిట్టా నారాయణ రావు సమర్పించి తిరి. మానేపల్లి. శ్రీనివాసరావు వారి ధర్మపత్ని, పద్మజాదంపతులు, ముత్తైదువులు, చుట్టుపక్కల గ్రామాల నుండి విచ్చేసి నటు వంటి గ్రామస్తులు పాల్గొని శ్రీ లక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజలో పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమాలు చేసితిరి. సమీప గ్రామ ప్రాంత మహిళా భక్తులు విచ్చేసి వీక్షించి ప్రసాదములు స్వీకరించితిరి.

## రామనామ తాళం భజనతో గణనాధుని నిమజ్జనం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వినాయక చవితి నవరాత్రులు ముగిసిన సందర్భంగా మండలంలోని వినాయక చవితి గణపతి విగ్రహాలను నిమజ్జనం కోసం ఊరేగింపుగా తరలించారు. గణపతి నవరాత్రులు ముగిసిన సందర్భంగా శుక్రవారం స్థానిక 3వ వార్డు లోని శ్రీ కోదండ రామాలయం 20వ వార్షికోత్సవ గణనాథుని ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. ఆలయం ప్రధాన అర్చక పండితులు క్రోవి శ్రీరామ మూర్తి, ఆలయ పూజారి మల్లికార్జునరావు పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా 2వేల మందికి అన్నసంతర్పణ చేసారు. డీజే బాక్సులు డప్పు వాయిద్యాలు వంటి సౌండ్ పొల్యూషన్ లేకుండా రామనామ సంకీర్తన చేసుకుంటూ నిమజ్జన కార్యక్రమం చేశారు. నిమజ్జన కార్యక్రమం లో పెద్ద ఎత్తున హరే రామ నామ భక్తబృందం తిరుమల తిరుపతి దేవస్థానం అవనిగడ్డ మండల ధర్మచార్యులు అన్నపురెడ్డి కృష్ణ కమిటీ వారు భక్తులు పాల్గొన్నారు. మండల పరిధిలోని పులిగడ్డ గ్రామాలలో గోల్డెన్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో గణనాధుని ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగాయి.

# జగ్గయ్యపేట ఏఎంసి చైర్మన్ఎస్సీ మహిళకే ఇవ్వాలి



**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 5, మేజర్ న్యూస్:** పట్టణంలోటిడిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులునెట్టెం రఘురామ్ స్వగృహంనందు ఆయన ను కలిసిజగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఎస్సీ మహిళ రిజర్వేషన్ ను అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగాఎం ఎస్ పి రాష్ట్ర నాయకులుకోట డానియల్ మాదిగ మాట్లాడుతూ 40 సంవత్సరాల తర్వాత జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి రొటేషన్ పద్దతిలో ప్రభుత్వం ఎస్ సి లకు కేటాయిస్తే దానిని కొందరు రాజకీయ నాయకులు స్వార్ధ రాజకీయలకు రిజర్వేషన్ మార్చే ప్రయత్నం చేయడం జరుగుతుందని అలా జరిగితే ఎంఆర్పి ఎస్ నాయకులు తీవ్ర పోరాటం చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలి అని జగ్గయ్యపేట ఎస్ సి సామాజిక వర్గం తాతయ్య గెలుపు కోసం తమ వంతు ప్రయత్నం చేసి గెలిపించారని అది మరచి ఎస్ సి లకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎస్సిలను పార్టీ కి దూరం చేసుకుంటే వారికి రాజకీయ భవిష్యత్ ఉండదని ఆయన హితవు పలికారు. ఎస్ సి సామాజిక వర్గానికి న్యాయం చేస్తే జీవితాంతం వారిని గుర్తు పెట్టుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులుమంద పిచ్చయ్య మాదిగ జగ్గయ్యపేటనియోజకవర్గం ఇంచార్జ్మాతంగి దావీదు మాదిగజగ్గయ్యపేట మండల అధ్యక్షులుచింతరాల గోపి మాదిగ జిల్లా ఉపాధ్యక్షులుమొండితోక విజయ్ మాదిగపెనుగంచిప్రోలు మండల నాయకులువేమవరపు స్వామి మాదిగ,చిలకల్లు గ్రామ అధ్యక్షులు పెసరమల్లి రాంబాబు మాదిగ, నాయకులుఅన్నేపాక పవన్ మాదిగమాతంగి కిషోర్ మాదిగయంబ్రాతి ప్రకాష్ రావు మాదిగపులి దిలీప్ మాదిగ పాల్గొన్నారు.

## దసరా సందర్భంగా క్యూలైన్ల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన సీపీ







**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నిన్న రథం సెంటర్ జమ్మిదొడ్డి మీటింగ్ హాల్‌లో జరిగిన రివ్యూ మీటింగ్ అనంతరం శుక్రవారం ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, ఇతర పోలీస్ అధికారులతో కలిసి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని వినాయ టెంపుల్ వద్ద నుండి ఏర్పాటు చేస్తున్న క్యూలైన్స్ లను స్వయంగా నడుచుకుంటూ పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు సలహాలు అందించారు. అదే విధంగా వాహనాల రాకపోకల వినియోగం కోసం వెస్ట్ బైపాస్ రోడ్డు ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నేపధ్యంలో నగర పోలీస్ కమీషనర్, ఇతర పోలీస్ అధికారులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్స్ లలో స్వయంగా నడుచుకుంటూ వెళ్లి ఏ ఏ ప్రదేశాలలో బారి గేటింగ్ చెయ్యాలి, హోల్డింగ్ చేయాలి, హోల్డింగ్ ప్రదేశాల వద్ద భక్తులు లోనికి వెళ్ళడానికి బయటకు రావడానికి ఏర్పాటు చేయు మార్గాల వద్ద చేయు ఏర్పాట్లపై తగు సూచనలు చేశారు. అదేవిధంగా వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల ప్రజల రాకపోకల కోసం వెస్ట్ బైపాస్ ను ఉపయోగించే విధంగా వెస్ట్ బైపాస్ ఏరియాను ప్రిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ జోన్ ఇన్ ఛార్జ్ డి.సి.పి. జి.రామకృష్ణ, పశ్చిమ ఏ.సి.పి. దుర్గారావు, ట్రాఫిక్ ఏ.సి.పి., వన్ టౌన్ ఇన్స్పెక్టర్ గురుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.



## వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ సెప్టెంబరు 05 :** గుడ్లవల్లేరులో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక నాయీ బ్రాహ్మణ కమిటీ స్వామివారిని తీన్ మార్ డప్పులు, బాణాసంచాతో ప్రధాన వీధుల్లో ఊరేగించారు. స్వామివారి ఊరేగింపులో మహిళా భక్తులు, వృద్ధులు, చిన్నారులు సైతం తండోపతండాలుగా ఊరేగింపులో పాల్గొన్నారు. స్వామివారికి అడుగడుగునా మహిళా భక్తులు హారతులు పట్టారు. ప్రముఖ వేద పండితులు డాక్టర్ అగ్నిహోత్రం ఫణిగోపాల్ స్వామివారికి ప్రత్యేక పూజలను జరిపించారు.

## భిక్షాటన ద్వారా నిరసన తెలిపిన ఇఫ్టూ ఆటో కార్మికులు




**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆటో మోటార్ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలను విస్మరించి, ఫ్రీ బస్సు పథకంతో ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బ కొట్టిన టిడిపి రాష్ట్ర ప్రభుత్వ చర్యను నిరసిస్తూ ఏపీ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ ఇఫ్టూ ఆధ్వర్యంలో పండిట్ నెహ్రూ బస్టాండ్ లో గల సిటీ టెర్మినల్ బస్టాండ్ లో ఆటో కార్మికులు భారీ స్థాయిలో భిక్షాటన కార్యక్రమం చేపటారు. స్త్రీ శక్తి ఉచిత బస్సుతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మిక కుటుంబాలను పోషించుకునేందుకు బిక్షాటన చేయాల్సిన దుస్థితిని చంద్రబాబు ప్రభుత్వం కల్పించిందని ఆటో కార్మికులు చేతులలో బోచ్చలతో ప్రయాణికులు దగ్గరికి వెళ్లి తమ బాధను వివరిస్తూ బిక్షాటన చేపట్టారు. పలువురు ప్రయాణికులు సానుభూతి వ్యక్తం చేస్తూ ఓట్లేసి గెలిపించినందుకు ఈ పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు నాయకులు కె పోలారి, దాది శ్రీనివాసరావు, ముని శంకర్ తదితరులు మాట్లాడుతూ ఆటో కార్మికులను చంద్రబాబు ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందన్నారు. ఆటో మోటార్ కార్మికుల సంఘాలతో చర్చ జరిపి హామీలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఎలాంటి చర్చలు జరుపకుండా మంత్రుల కమిటీతో కాలయాపన చేస్తున్నదన్నారు. ఇలాంటి మోసకారి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఎంతో దూరం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆటో మోటార్ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఫ్రీ బస్సు కారణంగా ఉపాధి నష్టపోతున్న ఆటో కార్మికులకు ఏడాదికి 30వేల రూపాయలు సహాయం ప్రకటించి ప్రత్యేకంగా ఆదుకోవాలని కోరారు. జీవో నెంబర్ 21 రద్దు తో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కూడా కోరారు. లేనిపక్షంలో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఈనెల 18వ తేదీన అన్ని ఆటో మోటారు సంఘాలతో కలిపి చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ప్రతి ఆటో కార్మికుడు డిమాండ్లతో కూడిన బోర్డును మెడలో వేసుకుని చేతుల్లో చిప్ప పట్టుకుని ప్రతి ప్రయాణికుని దగ్గరికి వెళ్లి అడుక్కుంటున్న తీరును చూసి ప్రయాణికులు తమ సానుభూతిని వ్యక్తం చేశారు. సిటీ టెర్మినల్ లో ప్రదర్శనలకు అనుమతి లేదని పోలీసు వారు భిక్షాటనతో నిరసన తెలియజేస్తున్న ఆటో నాయకులను, కార్మికులను లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డగించగా, పెద్ద ఎత్తున ఉన్న ఆటో కార్మికులు తాము ధర్నాలు చేయడం లేదని అడుక్కోవడం కూడా నేరమా! అంటూ లోపలికి దూసుకెళ్లి బిక్షాటన కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నాయకులు సిహెచ్ పెద్దిరాజు, డి శ్రీధర్ బాబు, యాదగిరి, సూరిబాబు, వై అప్పారావు, వలి, రఫీ, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



## నారాయణ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** డా.సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినోత్సవం పురస్కరించుకుని మచిలీపట్నంలోని శిడింబి అగ్రహారంలో గల నారాయణ స్కూల్ లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలను ఘనముగా నిర్వహించారు. నారాయణ స్కూల్ క్లస్టర్ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సాయి సుధీర్, ఈ కిడ్స్ కోఆర్డినేటర్ ప్రతిభ, ఈ చాంప్స కోఆర్డినేటర్ లియోని, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ డి చందన, ఈ చామ్స్ వైస్ ప్రిన్సిపాల్ ఎమ్ దివ్య వాణి, అకడమిక్ డీన్ కె శంకర సాంబశివరావు, ఒలింపియాడ్ ఇంచార్జ్ బి శ్వేత, టెన్త్ ఇంచార్జ్ ఎన్ శివ రామ కృష్ణ, ఏ ఓ వి రవికుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో ఉపాద్యాయులు మ్యూజికల్ చైర్స్, అంత్యాక్షరి, వంటి ఆట, పాటల కార్యక్రమములలో ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.
ఉపాధ్యాయులను ఘనముగా సత్కరించారు.

## లోగిశెట్టి వెంకటస్వామి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకి ద్రాక్ష పలరసం పంపిణీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మన రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు రామానాయుడు పేటలో నీ సిద్ధి బుద్ధి సమేత మహా గణపతి ఆలయం కమిటీ సభ్యుల, 13వ డివిజన్ ఇంచార్జ్, టీడీపీ పట్టణ అధ్యక్షులు లోగిశెట్టి వెంకటస్వామి ఆధ్వర్యంలో పవిత్ర మిలదున్నబి పండుగ సందర్భంగా జరిగే పాద యాత్రలో ద్రాక్ష ఫలరసం ముస్లిం సోదరులకి పంచడం జరిగింది ఈ కార్యక్రమంలో లో కృష్ణ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, 14వ డివిజన్ ఇంచార్జ్ అడపా రత్నాకర్, ఆలయ కమిటీ సభ్యుల పాల్గొనడం జరిగింది.

## ఘనంగా జాతీయ ఉపాద్యాయ దినోత్సవ వేడుకలు



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని ఏ కొండూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డిపీఆర్టియు ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సెలవులు పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఆర్.కళ్యాణి, కె.ప్రియాంకాప్రశాంతి, జయశ్రీ, నాగకుమారి, శామ్యూల్, జి.రమేష్, పి.రవి కుమార్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎ.కొండూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.జె. ఎమ్.డి ప్రసాద్, సంఘ నాయకులు రవి కృష్ణ కుమార్, సురేష్ బాబు, గిరిబాబు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, కేశవులు, స్వరూప రాణి, కన్యాకుమారి పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ, నందిగామ రూరల్, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999